## ఐఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఘనంగా యోగా దినోత్సవం

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిపిల భద్రతను పర్యవేక్షించే ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యు) ఆధ్వర్యంలో ఆది వారం నాడు అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. యూసుఫ్‌గూడలోని టిఎస్ఎస్‌పి బెటాలియన్ గ్రౌండ్స్‌లో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యు అధికారులతో పాటు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఐఎస్‌డబ్ల్యు ఎస్‌పి సయ్యద్ బాషా పర్యవేక్ష ణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఎంఎస్‌జి చక్రవర్తి మాట్లాడుతూ యోగా అందరి జీవితంలో భా గం కావాలని సూచించారు. ముఖ్యంగా నిత్యం ఒత్తిడితో విధులు నిర్వహించే పోలీసులు యోగాకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. ప్ర తి రోజు పావు గంట నుంచి అరగంట వరకు యోగా కోసం కేటాయిస్తే ఆరోగ్యం అనుక్షణం బాగుం టుందని ఆయన తెలిపారు. కేవలం యోగా దినోత్సవం నాడు యోగా సాధన చేస్తే సరిపోదని ఆయ న అన్నారు. భారత దేశంలో పుట్టిన యోగా నేడు ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించిం దని ఆయన తెలిపారు. అదనపు డిసిపి వాసుదేవ రెడ్డి యోగాసనాల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు సిబ్బంది చేత వాటిని చేయించారు. ఒత్తిడి నుంచి దూరంగా వుంచేది యోగా ఒక్కటేనని వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యు అధికారులు శ్రీధర్‌రెడ్డిసహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గూడ అంజయ్య పాటలు ప్రజాఉద్యమాలకు దిక్సూచి : సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 21:** ప్రజల బాధలను అక్షరాలుగా మలిచి, అణగారిన వర్గాల ఆకాంక్షలకు తన కలంతో స్వరం ఇచ్చిన ప్రజాకవి, సాహితీవేత్త గూడ అంజయ్య వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పిం చారు. గూడ అంజయ్య రచనలు కేవలం సాహిత్యపరంగానే కాకుండా సమాజాన్ని ఆలోచింపజేసిన చైతన్య దీపాలని, వారి పాటలు ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచి, పోరాట నినాదాలయ్యాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, మానవ విలువల కోసం వారు చేసిన సాహిత్య పోరాటం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, గూడ అంజయ్య ఆశయాలు, ఆలోచనలు, సాహిత్య వారసత్వం చిరస్మరణీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తదితరులు

## ఘనంగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి రజతోత్సవం

### 26వ వ్యవస్థాపక దినోత్సవంలో నందమూరి బాలకృష్ణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 20, ప్రభాతవార్త:** బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 సంవత్స రాల సేవలను పూర్తి చేసుకుని రజతోత్సవాలను ఘనంగా నిర్వ హించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి 26వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్, వైద్యేతర సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాల మధ్య నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఆస్పత్రి ఛైర్మన్, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ట్రస్టు బోర్డు సభ్యులు డాక్టర్ పోలవరపు రాఘవరావు, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, జె.ఎస్.ఆర్. ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎస్. రావు తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బంది తన కుటుంబసభ్యులేనని అన్నారు. ప్రతి యేడాది 'ఛైర్మన్స్ డే' పేరుతో అందరినీ కలుసుకుని సంస్థ అభివృద్ధిపై చర్చించే సంప్రదాయాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వాలు మారినా, ఎన్నో సవాళ్లు ఎదురైనా ఆస్పత్రి సేవలు నిరంతరాయంగా కొనసాగాయని చెప్పారు. అమరావతిలోని తుళ్లూరు ఆస్పత్రి, హైదరాబాద్‌లో చేపట్టనున్న విస్తరణ పనులను అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రపంచ ప్రఖ్యాత కేన్సర్ నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ కేన్సర్‌తో బాధపడుతున్న సమయంలో బసవతారకం చేసిన విజ్ఞప్తే ఈ ఆస్పత్రి ఏర్పాటుకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ట్రస్టు బోర్డు సభ్యుడు జె.ఎస్.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధిలో దాతల పాత్ర ఎంతో కీలకమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు దాతలు ఆస్పత్రి విస్తరణతోపాటు కేన్సర్ రోగుల సహాయార్థం విరాళాలు ప్రకటించారు. జిలాయత్ గౌస్ ఇనాయత్, అనంతపురం జిల్లా సుదాకర్ నాయుడు, కర్నూలుకు చెందిన సింగరాయం రంజిత్ కుమార్, ఖమ్మంకు చెందిన దాతలు విరాళాలు ప్రకటించారు. అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు పోలవరపు మాధవరావు కుటుంబం తరఫున రూ.1 కోటి విరాళాన్ని నందమూరి బాలకృష్ణకు అందజేశారు.

## రేపటి నుంచి విత్తన మేళా

### రాష్ట్రంలోని 2,601 రైతు వేదికల్లో సీడ్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలను సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 23 నుండి విత్తన మేళాను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విత్తన మేళాలో ప్రధానంగా బోనస్ కు సంబంధించి ఇటీవల నిర్ణయించిన 7 రకాల వరి వంగడాలను అందుబాటులో ఉంచనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2601 రైతు వేదికల్లో నాలుగు రోజుల పాటు ఈ విత్తన మేళా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే మండల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ ఖరీఫ్ సీజనుకు రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల టన్నుల మేర విత్తనాల వినియోగం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

అయితే ఒక వేళ ఎల్‌నినో ప్రభావంతో వరి విస్తీర్ణం తగ్గుతుందని భావిస్తున్న అధికారులు సుమారు 37 లక్షల నుంచి 40 లక్షల ఎకరాల్లో వరి పంట వేయవచ్చని అంచనా వేస్తున్నారు. ఇందుకు గాను 9 లక్షల టన్నులు విత్తనాలు అవసరం అవుతాయని లెక్కకట్టారు. ప్రభుత్వం తక్కువ ధరకే విక్రయిస్తున్న 7 రకాల సన్నాల విత్తనాలు ప్రయివేట్ విత్తన దుకాణాల వద్ద లభించడం కష్టమని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా రాష్ట్రంలో సన్నరకాల విత్తనాలు ఎన్నో ఉండగా రోగాలు సోకని, తక్కువ కాలంలో కోతకు వచ్చేవి, కలుపు ఇబ్బందులు లేని రకాలను సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం సూచించిన 7 రకాల్లో మొదటి రెండు రకాలు 130 నుంచి 140 రోజుల్లో కోతకు వస్తాయి. తరువాత మూడు రకాలు 120 నుంచి 130 రోజులు పంట చేతికొస్తుంది. ఇతర రకాల సన్నాలు 120 రోజుల లోపే కోత కోయవచ్చు. స్వల కాలంలో వచ్చే పంటల పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. వానాకాలం సాగుకు సిద్ధమైన రైతులు వరి ఇప్పటికే విత్తనాలు కొంటున్నారని, వ్యవసాయ శాఖ చెబుతున్న ఏడు రకాల సన్నాలు వేయాలనే నిబంధనలతో సాగు ఆలస్యం కావచ్చని భావిస్తున్నారు.

# 8 కామన్ ఎంట్రన్స్‌లకు 5,08,414 మంది దరఖాస్తు

**అత్యధికంగా ఎప్‌సెట్‌కు 3,01,743 మంది**

**పరీక్షలకు 4,61,013 మంది హాజరు**

**పకడ్బందీగా నిర్వహించిన తెలంగాణ ఉన్నత విద్యామండలి**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రవే శాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 85 శాతానికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం 8 కామన్ ఎంట్రన్స్ పరీక్షలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్వహించింది. మొత్తం కామన్ ఎంట్రన్స్‌లకు 5,08,414 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 4,61,013 మంది పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఎంట్రన్స్‌ల కోసం నిర్వహించిన పరీక్షలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి పకడ్బందీగా నిర్వహించింది. వాటిలో ప్రధానమైంది ఎప్‌సెట్ పరీక్ష. కామన్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఎప్‌సెట్‌కి అత్యధికంగా దరఖాస్తులు రాగా, తరువాత లాసెట్, పీజీ లాసెట్‌కి వచ్చాయి.

ఆ తరువాత ఐ సెట్‌కి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఎప్ సెట్-2026 పరీక్షలను మే 4, 5 తేదిల్లో అగ్రికల్చర్, పార్మసీ పరీక్షలను నిర్వహించగా, మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగంలో 2,10,766 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,97,241 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 1,44,704 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో 73,294 మంది అర్హత సాధించారు. మే 15న ఈ సెట్-2026 పరీక్ష జరిగింది. పరీక్షకు 18,626 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 17,870 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 16,726 మంది(93.60శాతం) అర్హత సాధించారు.

పీజీ ఈ సెట్ పరీక్షలు మే 29న ప్రారంభమైన జూన్ 1తో ముగిశాయి. పరీక్షల కోసం 26,077 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 23,637 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 21,958 మంది(92.66శాతం) అర్హత సాధించారు. ఎడ్ సెట్-2026 పరీక్ష మే 12న జరిగింది. ఎడ్ సెట్‌కి 35,600 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 29,342 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 28,446 మంది(96.95శాతం) అర్హత సాధించారు. లాసెట్, పీజీ లాసెట్ పరీక్ష మే 18న జరిగింది. పరీక్షలకు 66,864 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 54,374 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 39,673 మంది(72.96శాతం) అర్హత సాధించారు. ఐ సెట్ పరీక్షలను మే 13, 14 తేదీల్లో నిర్వహించారు. ఐసెట్‌కు 56,206 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 51,146 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 46,654 మంది( 91.22 శాతం) అర్హత సాధించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్(పీఈ) సెట్‌కి దరఖాస్తు చేసుకున్న వారికి మే 31 నుంచి జూన్ 3 వరకు శారీరక పరీక్షలను నిర్వహించారు.

బీపీఈడీ కోర్సు కోసం 2336 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1795 మంది హాజరయ్యారు. అందులో 1689 మంది(94.09 శాతం) అర్హత సాధించారు. డీపీఈడీ కోసం 962 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 654 మంది హాజరయ్యారు. అందులో 621 మంది(94.95శాతం) అర్హత సాధించారు.

## 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

### జిల్లాల వారీగా నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, సహాయకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో మొత్తం 15,982 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో అంగన్వాడీ సహాయకుల పోస్టులు 12,882 కాగా, అంగన్వాడీ టీచర్ పోస్టులు 3,100 ఉన్నాయి. దాదాపు ఐదేళ్ల తర్వాత జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో నిరు ద్యోగ మహిళలు, యువతుల్లో ఆశలు చిగురించాయి. కాగా రాష్ట్రంలో 35,781 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, వాటిల్లో 71,562 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో టీచర్లు, వర్కర్లు సమానంగా ఉంటారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేయాల్సిన సిబ్బందికి సంబంధించి 22.33శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతులు, పదవీ విరమణతో 2025-26 ఏడాది నాటికి ఏర్పడిన ఖాళీలను పరిగణలోకి తీసుకుంటూ ఖాళీలను ప్రభుత్వం గుర్తించింది.

# గాంధీభవన్‌లో ముగిసిన కామారెడ్డి కాంగ్రెస్ పంచాయితీ

### పరస్పరం చేతులు కలిపిన షబ్బీర్‌అలీ, చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 21:** గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన కామారెడ్డి కాంగ్రెస్ అంతర్గత వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. గాంధీభవన్ వేదికగా ఆది వారం జరిగిన కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సమక్షం లో ఈ వివాదం ముగిసింది. ఈ పంచాయితీలో కీలక నేతలు షబ్బీర్ అలీ, చంద్రశేఖర్‌రెడ్డి పరస్పరం చేతులు కలిపి, కలిసి పనిచేసేందుకు అంగీకరించారు. కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా ఉండటానికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఇరువర్గాల నేతలతో సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా కమిటీ నేతలకు పలు కీలక సూచనలు చేసింది. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి, కాంగ్రెస్ బలోపేతం కోసం, పార్టీ ఉన్నతి కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేసింది. నియోజకవర్గంలో పార్టీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా, వాటిని అంతర్గతంగా హైకమాండ్ దృష్టికి తీసుకురావాలే తప్ప, బహిరంగ విమర్శలు చేయకూడదని సూచించింది. పార్టీ నేతలు తమ పరిధిలోని వివాదాల కోసం పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగడం సరికాదని, దీనివల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. షబ్బీర్ అలీ గతంలో చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలపై తదుపరి సమావేశాల్లో సమగ్రంగా చర్చిస్తామని మల్లు రవి పేర్కొన్నారు.

కాగా, ఈ వివాదంలో భాగంగా కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరై తన వివరణ ఇచ్చారు. ఇటీవల సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన ఆడియో టేపుల వ్యవహారంపై ఆయన స్పందించారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న వివాదాస్పద ఆడియో టేపులకు, తనకు ఎలాంటి సంబంధం లేదని షబ్బీర్ అలీ కమిటీకి స్పష్టం చేశారు.

ఆ వాయిస్ తనది కాదని ఆయన ఖండించారు. తనను రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికి, తన ప్రతిష్ఠను దిగజార్చడానికి కొందరు ప్రత్యర్థులు కావాలనే కుట్ర పూరితంగా ఈ ఆడియోను సృష్టించి వైరల్ చేశారని కమిటీ ఎదుట తెలిపారు. షబ్బీర్ అలీ, చంద్రశేఖర్‌రెడ్డి చేతులు కలపడంతో కామారెడ్డి కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.

## భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలి

### వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించాలి

### ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను ఇతర సిబ్బందిని నియమించిలని లేఖలో కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య, విద్య రంగాలను పటిష్టం చేయాలని, తగిన నిధులు కేటాయించాలని కోరుతూ తమ పార్టీ నాయకత్వంతో కలిసి ఈ నెల 10న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించానని జాన్‌వెస్లీ సీఎంకు రాసిన లేఖలో పేర్కొ న్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరి హద్దులో ఉన్న భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఎంతో కీలకమైందని, ఈ ఆస్పత్రికి 80 శాతం మంది ఆదివాసీలే వైద్యం కోసం వస్తారని తెలి పారు. 62 మంది డాక్టర్లు ఉండవలసినచోట, 22 మంది మాత్రమే ఉన్నారని, ముఖ్యంగా సివిల్‌సర్జన్లు 16 మంది ఉండాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే ఉన్నారన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 37 మంది ఉండాలి, 23 మంది మాత్రమే ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. బ్లడ్ బ్యాంక్, రేడియాలజిస్టులు ఎవరూ లేరన్నారు. శానిటేషన్ వర్కర్లు 160 మందికి కేవలం 85 మంది మాత్రమే ఉన్నారు. భద్రాచలంలో అడ్వాన్స్ ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని జాన్‌వెస్లీ లేఖలో కోరారు.

# తుదిదశకు రైతు డిస్కం లైసెన్సు

### అడ్డంకిగా సాంకేతిక అంశం

### వారం పది రోజుల్లో మంజూరు

### నేటి వరకూ అభ్యంతరాలకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైతు డిస్కమ్ (టిజిఆర్‌డిసిఎల్)కు లైసెన్సు జారీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అయితే, ఉత్తర తెలంగాణ విద్యుత పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సవరణ పిటిషన్లపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్సీ) అభ్యర్థనలను పరిశీలిస్తుండటం వల్ల, లైసెన్సు జారీ మరోకొద్ది రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంల ఈ నెలాఖరు లేదా జూలై మొదటి వారంలో లైసెన్సు మంజూరు అయ్యే అవకాశాలు ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. లైసెన్సు జారీకి ఓ సాంకేతిక అంశం అడ్డంకిగా మారింది. ఇదే సమయంలో రైతు డిస్కమ్‌కు లైసెన్సు జారీ చేయడానికి ముందే.. వ్యవసాయ కనెక్షన్ల నుంచి తప్పుకుంటున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశాయి. బహిరంగ విచారణకు ముందే విద్యుత్తు చట్టం 2003లోని సెక్షన్ 18 నిబంధనలు, టీజీఈఆర్సీ డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ రెగ్యులేషన్ నంబర్4 2016ను సవరణ కూడా ఈ పిటీషన్‌లో ఉంది. వాటిపై అభ్యంతరాల స్వీకరణ పూర్తయిన తర్వాతే తుది నిర్ణయం వెలువడుతుంది. దీనికి సంబంధించి ఇప్పటికే విద్యుత్ నియంత్రణ కమిషన్ రైతు డిస్కమ్‌పై బహిరంగ విచారణను పూర్తి చేసింది. రైతు విద్యుత్ పంపిణీ సంస్థ పెట్టుకున్న పిటిషన్‌పై విద్యుత్ నియంత్రణ కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో భారీగా అభ్యంతరాలు, సూచనలు వచ్చాయి. రైతు డిస్కమ్ రూ.65 వేల కోట్ల అప్పులు, రెవెన్యూ లోటులో ఉన్నట్టు చూపడంతో ఇంత భారీ లోటుతో కొత్త డిస్కమ్ ఎలా నడుస్తుందని ప్రశ్నిస్తున్నారు.

అయితే వ్యవసాయ పంపు సెట్లు, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, వాటర్‌బోర్డు, మున్సిపల్ వాటర్ కనెక్షన్ల నుంచి తప్పుకొంటున్నట్లు ఉత్తర, దక్షిణ డిస్కమ్‌లు దాఖలు చేసిన సవరణ లైసెన్స్ పిటిషన్లపై ఈనెల 22వ తేదీ వరకు అభ్యంతరాలకు విద్యుత్ నియంత్రణ కమిషన్ అవకాశాన్ని కల్పించింది. వాటికి సవరణ లైసెన్స్‌ను జారీ చేసిన తర్వాత రైతు డిస్కమ్‌పై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మరోవైపు రైతు డిస్కమ్ పిటిషన్‌పై అధ్యయనం కోసం తెలంగాణ విద్యుత్ నియంత్రణ ఖమిషన్ కొంత గడువు కోరే అవకాశాలున్నాయనే చర్చ కూడా జరుగుతోంది.





సమావేశంలో మాట్లాడుతున్న ప్రియాంక కక్కర్

## ఫ్యూచర్ సిటీ పేరుతో రైతులకు అన్యాయం

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 21, ప్రభాతవార్త:** ఫ్యూచర్ సిటీ పేరుతో అన్యాయంగా, అక్రమంగా రైతుల భూములను గుంజుకుంటున్న దుర్మా ర్గమైన పాలన సిఎం రేవంత్‌రెడ్డిదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి, జాతీయ ప్రతినిధి ప్రియాంక కక్కర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పొట్టలు కొట్టి నియంతృత్వ దోరణిని అవలంభిస్తున్నదని నిశితంగా విమర్శించారు. తక్షణమే వారి భూములను వారికే అప్పగించాలని, రంగారెడ్డి జిల్లాలో పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా, ఫ్యూచర్ సిటీలోకి వెళ్ళి రైతులను, స్థానిక ప్రజలతో కలిసి రావడం జరిగిందని, రైతులందరూ తమ బాధలను వ్యక్తం చేశారని ఆమె గుర్తు చేశారు. దీనిపైన ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ బాధితులకు న్యాయం జరిగేంతవరకు ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు హేమ జిల్లోజుల, రాముగౌడ్, రైతులు పాల్గొన్నారు.

# నిలిచిన శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

### సాంకేతిక కారణాలతో తరచూ అవాంతరాలు

### పూర్తిస్థాయిలో దృష్టిసారించని విద్యుత్ శాఖ

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రానికి సంబంధించి శ్రీశైలం నాలుగవ యూనిట్లో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ పనులు నిలిచిపోయాయి. దీంతో డ్రై పీరియడ్ (ప్రాజెక్ట్ లో నీరు లేని సమ యం) త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. గతంలో విద్యుత్ శాఖ కార్యదర్శి గ్యారంటీ పీరియడ్‌లో తలెత్తిన సమస్య కాంట్రాక్టర్ ఉచితంగా మాత్రమే రిపేర్ చేయాలని నిర్ణయించారు. మరో కొత్త జనరేటర్‌ను అదే జపాన్ మిత్సుబిషి కంపెనీ వాళ్ళతోనే ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత ఆయన బదిలీ కావడంతో ఇప్పుడు ఓపెన్ టెండర్ విధానంలో పిలిచారు. నాగార్జున సాగర్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద రివర్సబుల్ పంపింగ్ ఏర్పాటు పనుల్ని నామినేటెడ్ బేస్ గా ఇవ్వాలని భావించగా, అప్పటి విద్యుత్ శాఖ కార్యదర్శి ఓపెన్ టెండర్ పిలవాలని భావించారు. ఆ తరు వాత అనుకోకుండా ఆకస్మికంగా ఆరు నెల్లోనే బదిలీ అయ్యారు. దాంతో వాటి పనులు కాస్తా ఆగిపోయాయి. కాగా జలవిద్యుత్ కేంద్రం నాలుగో యూనిట్‌లో పదేపదే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

రూ.25 కోట్ల వరకు వెచ్చించి మరమ్మతులు చేపట్టినప్పటికీ సాంకేతిక కారణాలతో పునరుద్ధరించిన తరచూ మళ్లీ ట్రిప్ అవడంతో శాశ్వత పరిష్కారం కోసం అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు. ఈ యూనిట్ ఉత్పత్తి సామర్థ్యం 150 మెగావాట్లుగా ఉంది. అయితే సాంకేతిక సమస్యలతో తరచూ మరమ్మతులు చోటు చేసుకోవడం సాధారణమైంది. ఈ నేపథ్యంలో ఒక ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో 2023-2025 మధ్య మూడుసార్లు మరమ్మతులు జరిగాయి. ఉత్పత్తి ప్రారంభించిన 10 గంటల్లోనే యూనిట్ నిలిచిపోయింది. జెన్‌కో ఇంజనీర్లు లోపాలపై లోతైన అధ్యయనం చేసినా సాంకేతిక సమస్యలతో తరచూ ఈ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోంది.

### ఫిన్లాండ్‌లో హైదరాబాద్ విద్యార్థి అదృశ్యంపై

## కెటిఆర్ తీవ్రఆందోళన

### బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ అండ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 21:** ఉన్నత చదువుల కోసం ఫిన్లాండ్ దేశానికి వెళ్లి, గత 45 రోజులుగా ఆచూకీ లేకుండా పోయిన హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతానికి చెందిన బీటెక్ విద్యార్థి ముత్యంరెడ్డి మణిదీప్ రెడ్డి ఉదంతంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయమై మణిదీప్ రెడ్డి తల్లిదండ్రులు ముత్యంరెడ్డి, మర్ణతలను కెటీఆర్ స్వయంగా కలిసి మాట్లాడారు. కొడుకు ఆచూకీ తెలియక అల్లాడిపోతున్న ఆ తల్లిదండ్రులకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి భరోసాను, ధైర్యాన్ని ఇచ్చారు. గత నెల 5వ తేదీ నుండి మణిదీప్ రెడ్డి ఎలాంటి ఫోన్ కాల్స్, మెసేజ్లకు స్పందించకపోవడం, ఇన్ని రోజులైనా అక్కడి అధికారుల నుండి ఎలాంటి సమాచారం, స్పందన రాకపోవడం అత్యంత బాధాకరమని కెటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."ఒక సామాన్య కుటుంబం ఎన్నో ఆశలతో తమ బిడ్డలను ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపితే, ఇవ్వాళ ఆ బిడ్డ ఆచూకీ లేకుండా పోవడం ఆ కుటుంబానికి తీరని వేదన మిగిల్చింది. స్థానిక పోలీసులు ఫిర్యాదును పట్టించుకోకపోవడంతోనే బాధిత తల్లిదండ్రులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించాల్సి రావడం దురదృష్టకరం. హైకోర్టు ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఫిన్లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం, తెలంగాణ పోలీసులకు నోటీసులు జారీ చేయడాన్ని స్వాగతి స్తున్నట్లు పేర్కొన్నారు. ఫిన్లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి స్థానిక ప్రభుత్వంతో, అక్కడి అధికారులతో మాట్లాడి మణిదీప్ రెడ్డిని సురక్షితంగా వెతికి పట్టుకునేలా కేంద్ర విదేశాంగ శాఖ తక్షణమే రంగంలోకి దిగాలని కోరారు.. తెలంగాణ పోలీసులు, ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి, విదేశాంగ శాఖ ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి వీలయినంత తొందరగా వెతికిపట్టుకునేలా చర్యలు తీసుకు నేలా డిమాండ్ చేశారు. ముత్యంరెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, మణిదీప్ రెడ్డి సురక్షి తంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు తమ వంతు పోరాటం చేస్తామని కెటీఆర్ హామీ చేశారు.

# పాఠశాలల బస్సు డ్రైవర్ల నిర్లక్ష్య డ్రైవింగ్

### ఐదు నెలల్లో 55,995 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు

### పలువురు డ్రైవర్లకు కంటిచూపు సమస్యలు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాఠశాలలు మొదల వడంతో విద్యార్థులను తం లించే బస్సుల డ్రైవర్ల గుణగణాలపై దృష్టి సా రించిన ట్రాఫిక్ పోలీసులకు షాకింగ్ న్యూస్ వెల్లడ య్యింది. ఇతర ప్రాంతాల విషయం ఎలావున్నా జంట నగరాలు, శివార్లలో వున్న పాఠ శాలల బస్సుల డ్రైవర్లు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసుల పరిశీలనలో వెలుగు చూసింది. అనేక మంది డ్రైవర్ల ప్రవర్తన ఆందోళన కలిగిస్తుండగా, వారి నిర్లక్ష్యం విద్యా ర్థులను ప్రమాదాలలో నెట్టే విధంగా వున్నట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. గడచిన ఐదు నెల ల వ్యవధిలో గ్రేటర్ పరిధిలో పాఠశాలల బస్సుల డ్రైవర్లు 55,995 సార్లు సెల్‌ఫోన్లు మాట్లాడుతూ బస్సులను నడుపుతున్నట్లు పోలీసుల పరిశీలనలో వెలుగు చూసింది. ఈ విషయం లో ఆయా పాఠశాలల యాజమాన్యాలు పెద్దగా స్పందించడం లేదని పోలీసుల పరిశీలనలో తేలింది. బస్సుల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన ఘటనల్లో బస్సుల యజమానులకు చలాన్లు రావడం తెలిసిందే. ఇందులో అనేక చలాన్లు పా ఠశాలకే నేరుగా వస్తున్నట్లు తేలింది. చాలావరకు బస్సులను పాఠశాలల యాజమాన్యాలు సొంతంగా నడుపు తుండడంతో డ్రైవర్ల తప్పిదం వల్ల ఏమైనా జరిమానాలు వస్తే యాజమాన్యాలకే వస్తున్నాయి. ఈ క్రమంలో డ్రైవర్లను మందలించి బుద్ధిగా వుండ మని చెప్పాల్సిన పాఠశాలల యాజ మాన్యాలు మౌనంగా వుండడం లేదా చిన్నపాటి హెచ్చరి కలతో సరిపుచ్చుతున్నట్లు పోలీసుల పరిశీలనలో వెలుగు చూసింది. ఇది ప్రమా దకర సంకేతంగా ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో విద్యార్థులను తరలించే బస్సులు అనేకసార్లు ప్రమాదాలకు గురైన విష యాన్ని పోలీసులు ఉదహరించారు. అదృష్టవశాత్తూ భారీ ప్రమాదాలు జరగక పోవడం, విద్యార్థులు చిన్నపాటి గాయాలతో బయటపడిన విష యాన్ని పోలీసులు చెబుతున్నారు. దీంతో పాటు పలువురు డ్రైవర్లు మద్యం సేవించి పట్టుబడిన విషయాన్ని పోలీసులు వెల్లడించారు. ఈ విష యంలో యాజమాన్యాలు కచ్చితంగా లేకుంటే విద్యార్థులకు ఏమైనా కావచ్చని వారు హెచ్చరించసాగారు. ఇక పాఠశాలల బస్సులను నడిపే డ్రై వర్లలో చాలా మందికి కంటి చూపు సమస్యలు వున్నాయని, ఈ విషయంలో యాజమాన్యాలు వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి వుంటుందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నెల నుంచి మే నెలాఖరు వరకు పాఠశాలల బసు ్సల డ్రైవర్లు 1014 మందికి కంటి చూపు పరీక్షలు నిర్వహించగా 316 మంది చూపు సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తేలింది. వీరి విషయం లో యాజమాన్యాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులు కోరారు. విద్యార్థులను తరలించే బస్సుల డ్రైవర్లకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించాలని, ఈ సందర్భంగా ఎవరికైనా దృష్టి లోపం వున్నా, చూపు సరిగ్గా లేకున్నా వారిని డ్రైవింగ్‌కు దూరంగా వుంచాలని పోలీసులు చెబుతున్నారు.

